సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ తల్లి

గుర్రంకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అమ్మవారు సంతానదేవతగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పొట్టకూటికోసం వెళ్లి...

● కువైత్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి



బండి వినోద్‌కుమార్ (ఫైల్)

సుండుపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటికోసం కువైత్ వెళ్లిన వ్యక్తి ఆదివారం అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జి.రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీ కోనంకివాండ్లపల్లె దళితవాడకు చెందిన బండి వినోద్‌కుమార్ (30) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వారి కుటుంబీకులు తెలిపారు. శనివారం హార్ట్ స్ట్రోక్ రావడంతో కువైత్‌లోని ఆసుపత్రిలో చేర్పించారు. ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. బండి వినోద్‌కుమార్ పది సంవత్సరాల నుంచి కువైత్‌లో ఉంటూ స్వగ్రామానికి వస్తూ పోతుండేవాడు. అతనికి భార్యతో పాటు మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. పొట్టకూటి కోసం కువైత్‌కు వెళ్లి మరణించడంతో తమ కుటుంబానికి దిక్కెవరని భార్య, తల్లి భోరున విలపిస్తున్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుఫాన్ కారణంగా సోమవారం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేశామన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

బోల్తా పడిన బస్సు

● కారును తప్పించబోయి...

7

● పలువురికి తీవ్ర గాయాలు .. ఆస్పత్రికి తరలింపు

ఎడతెరిపి లేని వర్షం

● పొంగిపొర్లిన నదులు, వంకలు ● నిండుకుండల్లా మారిన చెరువులు

● కొట్టుకుపోయిన కొండారెడ్డిపోడు, రెడ్డివారిపల్లెల తాత్కాలిక రోడ్లు

టిష్యూకల్చర్ అరటి మొక్కల నర్సరీలోకి చేరిన వర్షపు నీరు





కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లెకు వెళ్లే తాత్కాలిక రోడ్డు



రైల్వేకోడూరు-తిరుపతి మార్గంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్డు

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా రైల్వేకోడూరు నియోజకవర్గవ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లాయి. మండలంలోని రెడ్డివారిపల్లె, కొండారెడ్డిపోడు గ్రామాలకు వెళ్లే తాత్కాలిక రోడ్లు వరద నీటికి కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు రైల్వేకోడూరుతో సంబంధాలు తెగిపోయాయి. మూడు రోజులుగా వర్షం వీడకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు వ్యవసాయ, భవన నిర్మాణ పనులు లేకపోవడంతో కూలీలు ఇక్కట్లు పడ్డారు. మండలంలోని శెట్టిగుంట చెరువులోకి పూర్తి స్థాయిలో నీరు చేరి పొంగి అలుగు పారుతోంది. అదేకాకుండా గుంజన, కల్లేరు, గుండాలేరు తదితర నదులు ఉధృతంగా ప్రవహించాయి. వర్షాలకు అనంతరాజుపేట టిష్యూ కల్చర్ నర్సరీలోకి నీరు చేరడంతో మొక్కలు దెబ్బతిన్నాయి. గుండాలపల్లె, ఓబనపల్లె, బయనపల్లె తదితర గ్రామాల్లోని అంటు మొక్కల్లో వర్షపు నీరు చేరడంతో మొక్కలు చనిపోతున్నాయని ఇటు వ్యాపారులు, అటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబరు మాసం నుంచి తరచూ వర్షాలు రైల్వేకోడూరులో వర్షాలు కురుస్తున్నాయి. మామిడికి కోలుకోలేని దెబ్బపడింది. భూమిలో తేమ శాతం ఎక్కువ కావడంతో మామిడికి పూతలు రావని రైతులు అంటున్నారు. నాటిన బొప్పాయి మొక్కలు చనిపోతున్నాయని రైతులు ఆందోళన పడుతున్నారు. ఇదిలా ఉండగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైల్వేకోడూరు-తిరుపతి మార్గంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

నేలకొరిగిన వరి, రాలుతున్న టమోటా

● తుఫాన్ ప్రభావం..

● పొలంలోనే ధాన్యం..కుళ్లుతున్న గ్రాసం

● చలితో వణుకుతున్న ప్రజలు



నిమ్మనపల్లెలో నేల కొరిగిన వరి



రామసముద్రం మండలం గుంతలపేటలో రాలిపోయిన టమోటా

మదనపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైన అక్టోబరు చివరి నుంచి నవంబరు వరకూ పెద్దగా వర్షం కురవలేదు. కానీ మూడు రోజులుగా ఆ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. అయితే ఇప్పటి వరకూ కురిసిన వర్షపాతాన్ని పరిగణలోకి తీసుకుంటే కొన్ని పంటలకు ఉపశమనం కలిగినా వరి, టమోటా, కొత్తిమీర పంటలకు నష్టంగానే కనిపిస్తోంది. ఈ వర్షం వల్ల కనీసం కుంటల్లోకి కూడా నీరు చేరలేదు. జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, కుప్పం ఏరియాలలో తుఫాన్ ప్రభావం అధికంగా ఉంది. కాలువల్లో ప్రవాహం కొనసాగే స్థాయిలో కాకపోయినా.. రాత్రీపగలు విడతల వారీగా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం స్తంభించి పోయింది. ఉరుములు, మెరుపులు లేకపోయినా...చిన్నపాటి ఈదురు గాలులతో పాటు చలి తీవ్రత కూడా ఎక్కువగానే ఉంది. పట్టణంలోనే కాదు.. పల్లెల్లోనూ ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ఈదురుగాలులు, చలితీవ్రత చంపేస్తోంది. వృద్ధులు, పిల్లలు చలి గాలికి వణికిపోతూ ఇంటికే పరిమితమయ్యారు. దీంతో పల్లెలు, పట్టణం అనే తేడా లేకుండా ప్రధాన రహదారులు, వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. ఆసుపత్రి, ఇతర అత్యవసర పనులు అయితే తప్ప గడప దాటడం లేదు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రబీలో లక్ష హెక్టార్లలో వరి పంట సాగు కాగా అంతా దాదాపు కోత దశకు వచ్చేసింది. పంటనూర్పిడి సమయంలో తుఫాన్ మొదలు కావడంతో రైతుకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. సాగైన పంటలో 60 శాతం వరి పంటను రైతులు ఇప్పటికే కోసేయగా, మరో 40 శాతం పంట పొలం మీద ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే గింజ వంగడం ఎక్కువగా ఉండటంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న చిరుజల్లులతో పంట నేల కొరిగింది. మరో రెండుమూడు రోజులు ఇదే వాతావరణ పరిస్థితులు కొనసాగితే, గింజ మొలకెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే టమోటా పంటకు కూడా నష్టం వాటిల్లింది.

వర్షంతో టమోటాకు తీవ్రనష్టం



- కె.శంకరప్ప, రైతు, గుంతలపేట, రామసముద్రం

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు టమోటాను దెబ్బతీశాయి. ఇప్పటి వరకు మంచుతో తెగుళ్లబారిన పడగా తాజాగా ఎడతెరపి లేని వర్షంతో ఉన్న పంట పోయింది. తెగుళ్లు, వర్షంతో రెండు విధానాల నష్టపోయా. నాకున్న మూడెకరాల్లో రెండెకరాల్లో టమోటా సాగు చేశా. ఇప్పటికే రెండుపంటలు నష్టపోగా ఈసారి ధరలు బాగున్నాయి. అప్పుల నుంచి బయటపడొచ్చని భావించా. కానీ పరిస్థితి తారుమారైంది.

వరి పంట నేలపాలు



- ఎస్.దొరస్వామి, రైతు, నిమ్మనపల్లె

ఒకటిన్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశా. పంట దిగుబడి బాగానే వచ్చింది. పంట కోయడానికి మిషన్ కూడా సిద్ధం చేశాను. అయితే తుంపర్లు పడుతుండటంతో వాయిదా వేసుకున్నా. వాన ఇంకా ఎన్ని రోజులు ఉంటుందో భయం వేస్తోంది. ఇప్పటికే నీళ్లలో పడిపోయిన వడ్లు మొసులు వస్తాయేమోనని భయంగా వుంది. పైరు ఏపుగా పెరగడంతో అంతా కింద వాలిపోయింది. ఇక ఆ దేవుడే కాపాడాలి.

ప్రపంచ గణిత పండితుడు లక్కోజు

● దేశవ్యాప్తంగా 6 వేలకు పైగా గణితావధాన ప్రదర్శనలు ● అంకవిద్యాసాగర, విశ్వసాంఖ్యాచారులుగా బిరుదులు ప్రదానం ● నేడు గణితబ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయ శర్మ వర్ధంతి

వయొలిన్ వాయిస్తూ అవధానం చేస్తున్న లక్కోజు సంజీవరాయ శర్మ (ఫైల్)



ఆయన ఒక మారుమూల గ్రామంలోని సాధారణ కుటుంబంలో జన్మించారు. ఎలాంటి విద్యాభ్యాసం లేదు. పుట్టుకతోనే అంధుడు. అయినా అందరికీ కష్టతరమైన లెక్కల గణనలో ఆయనకు మరొకరు సాటి లేరు. గణితంలో ఎంత పెద్ద లెక్కనైనా ఇట్టే పరిష్కరించి చెప్పగలరు. ఎంతో భాషా సాహిత్య పాండిత్యముంటే గానీ అవధానాలు చేయలేరు. అందులో గణితంలో అవధానం చేయడం చాలా కష్టతరం. అలాంటిది గణితంలో దేశవ్యాప్తంగా 6 వేలకు పైగా గణితావధానాలు చేసి పండితులను సైతం ఆశ్చర్యచకితులను చేసిన అనితరసాధ్యుడు, అపార జ్ఞానవంతుడు గణిత బ్రహ్మ డాక్టర్ లక్కోజు సంజీవరాయశర్మ, కష్టతరమైన లెక్కలకు వయొలిన్ పలికించి వెంటనే సమాధానం చెప్పే అసామాన్య ప్రతిభ ఆయన సొంతం. గణిత విద్యా ప్రావీణ్యంతో అందరినీ ఆకట్టుకున్న ప్రతిభావంతుడు సంజీవరాయ శర్మ తప్ప మరెవరూ లేరని ఎందరో మేధావులు కొనియాడారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

ప్రొద్దుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామంలో 1907 సంవత్సరం నవంబరు 22న పెద్ద పుల్లయ్య, నాగమాంబ దంపతులకు లక్కోజు సంజీవరాయ శర్మ జన్మించారు. ఆయన పుట్టుకతోనే అంధుడు. ఆయనను పెంచడం చాలా కష్టతరమని.. గొంతు పిసికి దిబ్బలో పూడ్చివేయాలని మంత్రసాని సలహా ఇచ్చింది. మరికొందరు మహిళలు పురిటి బిడ్డ నోట్లో వడ్లగింజలు వేశారు. అయినా ఆ పసివాడు చావలేదు. ఆ చిన్నారి హస్తరేఖలు చూసిన తాతా సంజీవరాయశర్మ గొప్ప ప్రతిభావంతుడు అవుతాడని చెప్పడంతో అంధుడైనా ఎంతో ప్రేమతో తల్లిదండ్రులు పెంచుకున్నారు. బాల్యదశలోనే తండ్రి మరణించారు. తల్లి పెంచి పెద్ద చేసింది. ఆ రోజుల్లో బ్రెయిలీ లిపి లేకపోవడంతో సంజీవరాయశర్మ చదువుకునేందుకు వీలు కాలేదు. అతడి అక్క అక్కమ్మ కల్లూరు ప్రాథమిక పాఠశాలలో చదివేది. ఆమె బడికి వెళ్లి వచ్చాక ఇంటి వద్ద పాఠాలు గట్టిగా చదువుతుంటే విని గుర్తు పెట్టుకునేవారు. అలా ఆయన మామూలు పాఠాలతో పాటు అంకెలు, గణిత సూత్రాలు గుర్తు పెట్టుకుని పునశ్చరణ చేసేవారు. ఎవరి వద్ద చదువుకోకుండానే గణితంలో తనకంటూ తెలియని విషయాలు ఏవీ లేవంటూ విమర్శకులను మెప్పించారు. గ్రామంలో రైతులకు ధాన్యం ధర, భూమి కొలతలు చెప్పేవారు. దీనికి వారు ఆయనకు కొంత సొమ్ము చెల్లించేవారు. గణితంలో ప్రావీణ్యం సాధిస్తున్న సమయంలోనే కల్లూరులోని లక్ష్మీనరసయ్య అనే విద్వాంసుని దగ్గర వయొలిన్ నేర్చుకున్నారు. ఆ తరువాత వయొలిన్ వాయించడం ఆయన జీవితంలో భాగమైంది.

గణితంలో ప్రజ్ఞ

సాహిత్యంలో కవులు అవధానాలు చేయడం పరిపాటి. అంటే 8 మంది వరుసగా ప్రశ్నలు వేస్తుంటే ఆయా అంశాలకు వెంట వెంటనే పద్యాల రూపంలో జవాబు చెప్పాలి. అలాగే గణితంలో కూడా అవధానం ఉంది. లక్కోజు సంజీవరాయ శర్మ గణితంలో అవధానాలు చేయడంలో దిట్టగా మారారు. పుట్టినతేదీ, సంవత్సరం, ప్రదేశం, సమయం చెప్పగానే ఆయన దానికి సంబంధించిన తిథి, వారం, నక్షత్రం, యోగ కరణాలు చెప్పేసేవారు. అలాగే జాతకాన్ని సైతం తెలియజేసేవారు. కలం, కాగితం రెండూ ఉన్నా గంటల కొద్దీ సమయంలో కూడా చెప్పలేని సమాధానాలను ఆయన ప్రశ్న అడిగినంత సులభంగా ఏమాత్రం తడుముకోకుండా చెప్పేవారు. ఆయనేమన్నా విద్యావంతుడా పోనీ రెండు కళ్లు ఉండి అంకెలిలా ఉంటాయి, సంఖ్యలిలా ఏర్పడుతాయని చూడగలిగిన వారా! కాదు పుట్టుకతోనే అంధుడు. వేల ప్రశ్నలు అడిగినా ఆయన చెప్పిన సమాధానాలు సరిచూసుకోవడానికి గణిత మేధావులకు గంటల తరబడి సమయం కావలసి వచ్చిందని చెబుతారు.

ఆయన మొట్ట మొదట 1928 నవంబరు 15న నంద్యాలలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో గణిత అవధానం చేసి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. 1931 జూలై 21న ఆంధ్ర మహాసభ భవనంలో స్వాతంత్ర్య సమరయోధుడు నాగేశ్వరరావు అధ్యక్షతన సంజీవరాయ శర్మ గణితావధానం చేశారు. ఆ కార్యక్రమంలో నాటి మద్రాసు గవర్నర్ సర్ జార్జి స్టాన్లే అవధానం తిలకించి ఆశ్చర్య చకితులై శర్మతో కరచాలనం చేశారు. శర్మ ఇంగ్లాండులో పుట్టి ఉంటే ఆయన విగ్రహాన్ని లండన్ నడిబొడ్డున ఏర్పాటు చేసి దేశాధ్యక్షుడి చేత ఆవిష్కరించి గౌరవించి ఉండేవాళ్లమని కొనియాడారు.

4 వేల సంవత్సరాల క్యాలెండర్

4 వేల సంవత్సరాలకు సరిపడే క్యాలెండర్‌ను తయారు చేసి ఆనాటి భారత రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌కు పంపారు. రాష్ట్రపతి ప్రశంసిస్తూ నెల చివరి రోజులు కనుక నా జీతంలో మిగిలిన మొత్తం రూ.875 పంపిస్తున్నానని ఎక్కువ సొమ్ము పంపలేకపోయానని సందేశం రాష్ట్రపతి శర్మకు సందేశం పంపారు.

కల్లూరులో సంజీవరాయ శర్మ విగ్రహం

కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూలులో గణిత బ్రహ్మ సంజీవరాయ శర్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని గణిత మేధావి కావాలనే ఉద్దేశ్యంతో 2018 డిసెంబరు 2న ఆయన వర్ధంతి సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పారు. లక్కోజు సంజీవరాయ శర్మ జయంతి నవంబరు 22న ప్రతి ఏడాది గణిత ప్రతిభా పరీక్షలు పెట్టి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. 1989-90లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శర్మ విగ్రహాన్ని తయారు చేయించారు. ఇంతటి ఖ్యాతి, కీర్తి కలిగిన సంజీవరాయ శర్మ విగ్రహం సాహిత్య ఉద్ధండులకు నిలయమైన ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయాలని పలువురు సాహిత్య ప్రముఖులతో పాటు ఉపాధ్యాయులు, మేధావులు కోరుతున్నారు.



బంగారు పతకాలతో సత్కారం

దేశవ్యాప్తంగా ఆయన చేసిన 6 వేలకు పైగా గణిత అవధానాలకు పలు విశ్వవిద్యాలయాలు ఆయనను సత్కరించి 14 బంగారు పతకాలు ఆయనకు అందజేశాయి. సంజీవరాయ శర్మ గణిత అవధాన ప్రతిభను గుర్తించిన వెంకటేశ్వర విశ్వవిద్యాలయం 1993లో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి గౌరవించింది. అలాగే గణిత బ్రహ్మ అంకవిద్యాసాగర విశ్వ సాంఖ్యా చార్య బిరుదులు ప్రదానం చేశారు.

హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవితో ప్రశంసలు

1958 జనవరి 21న బెంగళూరు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో శర్మ గణిత అవధాన ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనలో హ్యూమన్ కంప్యూటర్‌గా పేరుగాంచిన శకుంతలాదేవితో శర్మకు పరిచయం ఏర్పడింది. ఆయన మేధాసంపత్తిని గణిత శాస్త్ర ప్రావీణ్యాన్ని, ప్రతిభను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. శర్మ నా కంటే గొప్పవారని ఆమె కీర్తించారు. తేదీ ఇస్తే దానికి నేను వారం మాత్రమే చెప్పగలను శర్మ మాత్రం తెలుగు సంవత్సరం, నెల, నక్షత్రం, తిథి, రాశి తదితర వివరాలన్నీ చెబుతారు. ఇది సామాన్యమైన విషయం కాదు అని శకుంతల ఆయన గొప్పతనాన్ని కొనియాడటం విశేషం.

ప్రపంచ గణిత శాస్త్రజ్ఞుల్లో ఒకరు

ప్రపంచంలో అంధులైన జాన్‌మిల్టన్, బ్రెయిలీ లిపి కనుగొన్న లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్, ద్వారం వెంకటస్వామినాయుడు వంటి వారు పుట్టుకతో అంధులు కారు. తదనంతరకాలంలో వారు అంధులయ్యారు. మన దేశంలో గణిత శాస్త్రజ్ఞుల్లో భాస్కరాచార్యులు, రామానుజన్, శకుంతలాదేవి వంటి వారు మంచి శిక్షణ పొందారు. కానీ సంజీవరాయ శర్మ ఎలాంటి చదువు సంధ్యలేని వ్యక్తి. పైగా అంధుడు అంతా వినికిడి జ్ఞానంతోనే గణిత అవధానిగా పేరొందారు. ప్రపంచంలోని ఆరుగురు గణిత మేధావుల్లో ఒకరిగా ఖ్యాతి పొందారు.



సంజీవ రాయ శర్మ (ఫైల్)

విజ్ఞానాన్ని దొంగిలించలేరు

1964లో రేణిగుంట నుంచి తిరుపతికి రైలులో ప్రయాణం చేస్తుండగా శర్మ కోటుకు ఉన్న 14 బంగారు పతకాలను దొంగ దొంగిలించాడు. నా పతకాలు దొంగిలిస్తే దొంగిలించారు కానీ నా విజ్ఞానాన్ని ఎవరూ దొంగిలించలేరని ఆయన ఏమాత్రం బాధపడకుండా చెప్పారు.

కాళహస్తీశ్వరుని సన్నిధిలో...

1968 నుంచి 1993 వరకు ఆయన కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో వయొలిన్ వాయిస్తూ జీవనం సాగించేవారు. 1994 జనవరి 4న భార్య ఆదిలక్ష్మమ్మ చనిపోవడంతో కుమారుడు సుబ్బరాయుడు వద్దకు చేరారు. 1997 డిసెంబరు 2న హైదరాబాదులో ఆయన పరమపదించారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రాష్ట్రపతి, ప్రధాని ఎదుట గణితావధానం

1959లో నాటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ఢిల్లీలో లక్కోజితో గణితావధానాన్ని ఏర్పాటు చేయించి తిలకించారు. ఆ కార్యక్రమానికి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కూడా హాజరయ్యారు. 1961 జనవరి 16న ముద్దనూరులోని యామవరం రోశిరెడ్డి నాయకత్వంలో గణితావధానం చేశారు. ఈ ప్రదర్శన తిలకించిన పండితులు, శాస్త్రవేత్తలు, ప్రజలు ఆయనను ఘనంగా సన్మానించారు. ఇది ఆయనకు లభించిన మొదటి బంగారు పతకం. అప్పటి నుంచి ఆయన దేశవ్యాప్తంగా ఢిల్లీ, ముంబాయి, బిహార్, కర్ణాటక రాష్ట్రాలలో 6 వేలకు పైగా గణితావధాన ప్రదర్శనలు ఇచ్చారు.



బాలపల్లె అటవీ ప్రాంతంలో ప్రయాణికులకు కనువిందు చేస్తున్న జలపాతం

కొండా కోనల్లో...

తిరుమలగిరుల నుంచి జాలువారిన నీరు

జలపాతమై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల గిరుల నుంచి వర్షపునీరు జాలువారుతున్నాయి. కొండాకోనలు దాటి రైల్వేకోడూరు పరిసర కొండల్లో జలపాతమై పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తిరుమలగిరిలోని జలాశయాలు పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధారల్లో ఆదివారం ఉధృతంగా వరద నీరు చేరడంతో రైల్వేకోడూరు అడవుల్లో ఎక్కడ చూసినా వరద నీటి ప్రవాహం చూపురులను ఆకట్టుకుంటున్నాయి. నీటి గలగల శబ్దాలు వినసొంపుగా ఉన్నాయి. జలాశయాలు పూర్తి స్థాయిలో వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతున్నాయి. అక్కడి నుంచి వెలుగోండ, శేషాచలం అడవుల నుంచి రైల్వేకోడూరు మండలం బాలపల్లె అటవీ ప్రాంతంలో వరద నీరు జలపాతాల్లా ప్రవహిస్తున్నాయి. ఈ జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ముందుస్తు చర్యగా రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తన సిబ్బందితో ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తిరుమలలోని పాపవినాశనం డ్యాంలో 693.27 మీటర్లకు 697.14 మీటర్ల వరకు వరద నీరు చేరింది. గోగర్భం డ్యాంలో 2894 అడుగులకు 2894 అడుగులు నిండింది. ఆకాశగంగ డ్యాం 855.0 మీటర్లకు 865.00 అడుగులు నిండింది. కుమారధార డ్యాం లో 890.80 మీటర్లు, పసుపుధార డ్యాం 896.35 మీటర్లకు 898.24 మీటర్ల వరకు నీరు చేరిందని సంబంధిత అధికారు లు తెలిపారు. వర్షం తగ్గకపోవడంతో అడవుల్లో వరద నీరు పెరుగుతూ ఉంది.

'సాగర్' కాల్వలకు మోక్షమెప్పుడు?

మొరాయించిన తూము గేట్లు ● మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం

కాల్వల్లో పెరిగిన చెట్లు ● పూర్తికాని కుడి కాల్వ పనులు



బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ఎడమ, కుడికాల్వల మరమ్మతులకు మోక్షం వచ్చినట్లులేదు. గురవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు తూము గేట్లు మరమ్మతు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా ఇప్పటికే వ్యవసాయానికి నీరు వదలడంతో కుడికాల్వ వెంబడి 230 క్యూసెక్కులు, ఎడమ కాల్వ వెంబడి 400 క్యూసెక్కులు నీరు పారుదల ఉంది. ప్రస్తుతం తూముర గేట్లు మొరాయించడంతో కుడికాల్వ ద్వారా పోయే నీరు ప్రస్తుతం చెరువుల్లోకి వెళుతున్నాయి. చెరువులు నిండిన వెంటనే పంట పొలాల్లోకి పోతాయని, పంటలు నాశన మవుతాయని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో రైతన్నలకు నీళ్లు అందాలంటే ప్రస్తుతం మొరాయించిన బ్రహ్మం సాగర్ గేట్లకు మర మ్మతులు చేపట్టాలని రైతన్నలు కోరుతున్నారు. వివరాల్లోకెళితే...


బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద దాదాపు లక్షా 80వేల ఎకరాలు సాగులోఉంది. కొత్తూరు, పాతూరు, నరసన్నపల్లె, ముదిరెడ్డిపల్లె, సౌదరివారిపల్లె ఆశ్ర మం గంగిరెడ్డిపల్లె దిగువ నేలటూరు, మల్లేపల్లె ల్లో ఏటా రెండు దఫాలుగా పైర్లు వేస్తుంటారు. పంటలకు నీటిని సరఫరా చేసే పిల్లకాల్వలు లేకపోవడంతో సాగునీరు అందడంలేదని రైతన్న లు వాపోతున్నారు. ప్రస్తుతం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 11 టీఎంసీలు నీరున్నా సమయానికి పంటలకు నిరందని పరిస్థితి. మెయిన్ కాల్వ వెంబడి నీళ్లు వెళుతున్నా సకాలంలో పంటకు నీరందడంలేదు. ఎడమ కాల్వ వైపు ఉన్న చెరవులకు నీళ్లు అరకొరగా వెళుతున్నా కుడికాల్వ వైపు ఉన్న కాల్వ వెంబడి నీళ్లు వృధాగా వెళుతున్నాయి. ఇక్కడ పిల్లకాల్వల పనులే ఇందుకు అడ్డంకిగా చెప్పవ చ్చు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా పంటలకు సంతృప్తికరంగా నీళ్లు అందడంలేదని రైతులు బాధపడుతున్నారు. ఈ విషయంపై రైతులు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సాగర్ కుడికాల్వ తూముగేట్లు మరమ్మతులకు గురవడంతో నీళ్లు వృధాగా వెళ తున్నాయి. ప్రస్తుతం వరి పంట చేతికి వస్తున్న తరుణంలో కుడికాల్వ ద్వారా పారుదలయ్యే నీరు పొలాల్లోకి వస్తాయని ఆందోళనకు గురవుతున్నారు. తెలుగుగంగ అధికారులు పదిరోజులుగా గేట్ల మరమ్మతులు చేపట్టినా కూడా ఫలితం దక్కలేదు. బ్రహ్మంసాగర్ నిండు కుండలా ఉన్నా పంటలకు నీరందడం లేదని మరోవైపు బ్రహ్మంసాగర్ కుడివైపు తూము గేట్లు మొరాయించడంతో నీళ్లు వృధాగా పోతున్నాయని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కుడికాల్వ తూము గేట్లు మరమ్మతులు చేపట్టాలని, మెయిన్ కెనాల్ కాల్వ వెంబడి పంట పొలాల్లోకి వెళ్లే చిన్న కాల్వల పనులు చేయించాలని రైతన్నలు కోరుతున్నారు.



గేటు మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు



కంపచెట్లతో నిండి ఉన్న చిన్నకాల్వలు



అసంపూర్తిగా కాల్వలు

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

రూ.12.5 లక్షల విలువైన నగదు స్వాధీనం



అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసిన రాజంపేట డీఎస్పీ సుధాకర్, సీఐలు

రాజంపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, చిట్వేలి పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన అంతరాష్ట్ర దొంగలను ఎట్టకేలకు రాజంపేట, రైల్వేకోడూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎస్.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా బిట్రగుంట కప్పరాల తిప్ప వాసి పీట్ల మహేష్, పీట్ల శరీనకుమార్ అక్టోబరులో కె.శ్రీనివాసులు స్థానిక ఐడీబీఐ బ్యాంకులో కుదువ పెట్టిన బంగారాన్ని విడిపించుకుని తీసుకువస్తున్న క్రమంలో రెక్కీ చేసి స్కూటీలో ఉన్న డబ్బు, బంగారాన్ని దొంగలించారు. చిట్వేలిలో కూడా బ్యాంకు వద్ద రెక్కీ చేసి బంగారం దొంగలించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఎల్లంరాజు, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి ఎస్ఐ కె.రఘురాం, సిబ్బంది వారిని పట్టుకున్నారు. వారి నుంచి 132 గ్రాముల బంగారం, రూ.3.10 లక్షల నగదు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12.5 లక్షలు ఉంటుందని తెలిపారు. గతంలో వీరు అనేక జిల్లాల్లో ఇతర రాష్ట్రాల్లోనూ నేరచరిత్ర ఉందని, పలు కేసుల్లో నిందితులని డీఎస్పీ తెలిపారు.

టీడీపీ నేతలపై కత్తులతో దాడి - ఒకరికిగాయాలు



చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

ముద్దనూరు డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక పులివెందుల రోడ్డులోని టీ కహాని సమీపంలో ఆదివారం సాయంత్రం బైకులో వెళుతున్న వేల్పుచర్ల టీడీపీ నేతలను అదే గ్రామ వైసీపీ నేతలు కత్తులతో దాడి చేయగా టీడీపీకి చెందిన గంగరాజు ఎడమ కాలికి తీవ్రగాయమైంది. బాధితుడు సమాచారం మేరకు వివల్లోకెళితే...

కొద్ది రోజుల కిందట వైసీపీకి చెందిన ఈశ్వరయ్య జీవాలు దొంగలు తీసుకెళ్లారు. ఈవిషయమై మా బంధువైన ఓబులేసు, ఈశ్వరయ్య, అతని కొడుకు శివకృష్ణ జీవాలు దొంగలించింది నీవేనని బెదిరిస్తూ వేధిస్తున్నారు. ఆదివారం వెల్పుచర్లలో ఇంటికి వెళతుండగా ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు కారంపొడితో దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు దాడికి దిగాయి. పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు. ఇరువర్గీయులూ స్టేషన్‌రావాలని పోలీసులు తెలపడంతో ఓబులేసుతో కలిసి బైకులో వస్తుండగా టీకహాని వద్ద ఈశ్వరయ్య అతని కొడుకు మరి కొందరు వైసీపీ నేతలు బోలేరో వాహనంతో బైకు వెనుక వైపున ఢీకొట్టారు. వెంటనే వాహనంలో తెచ్చిన కత్తులతో కిందపడిన వారిపై దాడి చేశారు. ఓబులేసుకు స్వల్పగాయాలవగా, గంగరాజు కాలికి తీవ్రగాయమైంది. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి

అనుమానం వ్యక్తం చేసిన మృతుడి భార్య ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ లింగప్ప



వసంతకుమార్ మృతదేహం

జమ్మలమడుగు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నుంచి శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో మోటారు సైకిల్ పక్కనే మేకా వసంతకుమార్ (27) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ఎస్‌పీజీ క్వార్టర్స్ వాసి వసంతకుమార్ కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మ్మలమడుగు నుంచి కడపకు వెళ్లి తిరిగి జమ్మలమడుగు వస్తాడు. అయితే రాత్రి 12 గంటలకు ఇంటి నుంచి బుల్లెట్ సైకిల్‌పై (రాళ్లగుండ్ల కుంట) శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో వెళ్లాడు. అక్కడ కేవలం తలకు, ముఖానికి రక్తగాయాలై ఘటనా స్థలంలోనే మృతిచెంది పడి ఉన్నాడు. ఆదివారం ఉదయాన్నే తెల్లవారుజామున ఆ వైపున వాకింగ్‌కు వెళ్లేవారు సమాచారం ఇచ్చారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్‌ఐలు రామక్రిష్ణ, కల్పన, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న మృతుని బంధువులు ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతునికి భార్య వసుంధర, కుమారుడు ఉన్నాడు. తన భర్త మృతికి గల కారణాలు తెలియాలని, అనుమానం ఉన్నట్లు మృతుని భార్య అర్బన్ పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ కార్డులు, పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పేదలకు కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తోందని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. సంక్రాంతి కానుకగా అర్హులకు జనవరిలో కొత్తకార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

కడప క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప పగరం ప్రకాశ్‌నగర్‌లో ఓ వృద్ధురాలు మెడలోని గొలుసును గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి వద్దకు వచ్చి పింఛను ఇప్పిస్తామంటూ చెబుతూ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లి పారిపోయారు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో వృద్ధురాలి బంధువులు ఫిర్యాదు చేశారు.

స్థలాన్ని పరిశీలించిన దిశ డీఎస్పీ



విచారణ చేస్తున్న కడప దిశ డీఎస్పీ రమాకాంత్

కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌బజార్‌లోని ఓ స్థలం విషయమై కడప దిశ డీఎస్పీ రమాకాంత్ ఆదివారం విచారణ చేపట్టారు. చౌటిపల్లె వాసి వెంకటేశ్వర్లు స్థలం విషయమై ముద్దనూరు మండలం కొర్రపాడు వాసులు శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి కులం పేరుతో దూషించారని పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక మెయిన్‌బజార్‌లో ఉన్న స్థలాన్ని పరిశీలించి డీఎస్పీ స్థానికులను విచారించారు. కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రనగర్ వాసి, టీడీపీ కార్యకర్త కుడుముల నాగేశ(55) ఆదివారం తెల్లవారుజామున ఇంటి మెట్ల నుంచి జారిపడి మృతి చెందాడు. ఇంటి డాబా నుంచి మెటికలు దిగుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో ఇతని తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఇతన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. నాగేశ స్థానికంగా గాలిమిషన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోరిశెట్టి బాబు, బుజ్జి తదితర టీడీపీ నేతలు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ జట్టుకు అరుణ ఎంపిక



కడప స్పోర్ట్స్, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ 2024 అండర్-20 మహిళా జాతీయ స్థాయి ఫుట్‌బాల్ ట్రయల్స్‌కు జిల్లా నుంచి తమటపు అరుణ ఎంపికైంది. ఈనెల 10న బెంగుళూరులో ఏఐఎఫ్ఎఫ్ ఫుట్‌బాల్ ట్రయల్స్‌కు రాష్ట్రంలో ఇద్దరు ఎంపికయ్యారు. ఇందులో కడప జిల్లా నుంచి అరుణ, అనంతపుర జిల్లా నుంచి మందల అనూ ష ఎంపికైనట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీధర్ వెల్లడించారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ ఇస్తానని చెప్పిన మాటను సీఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు ఐదేళ్లుగా డీఏ బకాయిలు జమ కాలేదని వాటిని వెంటనే ఉద్యోగుల ఖాతాకు జమ చేయాలని కోరారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేగవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుని నివేదికను సత్వరం తెప్పించుకుని అమలు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్ధనరెడ్డి సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

రైలు ఢీకొని వృద్ధునికి గాయాలు



చికిత్స పొందుతున్న గోపాల్

కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె- ఓబుళాపురం మధ్యలో ఆదివారం రైలు ఢీకొనడంతో వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన గోపాల్ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ సంఘటనలో కాలు, చేయి విరిగినట్లు సమాచారం. ఇతన్ని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

'కరెంటు చార్జీల భారం తగదు'



వేంపల్లె, డిసంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై కరెంటు చార్జీల భారం శోచనీయమని కాంగ్రెస్ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలను మోసం చేయడం తగదన్నారు. ఇటీవలే సర్దుబాటు పేరుతో రూ.6వేల కోట్లు భారం వేశారని, మళ్లీ ఇపుడు రూ.9వేలకోట్లు భారం వేయడం ప్రజలను వంచించడమేనన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజలపై కరెంటు చార్జీల భారం లేకుండా చూడాలని తులసిరెడ్డి హితవు చెప్పారు.

అదుపు తప్పి బోల్తా పడిన బస్సు

● కారును ఢీకొని...

● పలువురికి తీవ్ర గాయాలు ● తిరుపతికి ఇద్దరి తరలింపు

కురబలకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న బస్సును వెనుక నుంచి వస్తున్న కారు అధిగమిస్తుండగా బస్సు అదుపు తప్పి కారును ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరు పతికి తరలించారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలిల్లోకెళితే....

కనిగిరి నుంచి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కురబలకోట ఫ్లైఓవర్ వద్ద వెళుతోంది. కడప రోడ్డు నుంచి మదనపల్లె వైపు (వెనుక భాగం) నుంచి వస్తున్న కారు ముందు వెళుతున్న బస్సును అధిగమిస్తుండగా ప్రమాదవశాత్తు బస్సు కారును ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో చిన్నయ్య, కొండమ్మ, బావాజీ, బెంగళూరుకు చెందిన వెంకటరమణ, కనిగిరి వాసులు లేయమ్మ, సాలెమ్మ, మాలకొండయ్య గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు వైద్యులు చికిత్స నిర్వహించారు. కాగా లేయమ్మ, మాలకొండయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సం ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు.



రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన బస్సు - క్షతగాత్రులను చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

ఖాదీ బోర్డు చైర్మన్‌కు సన్మానం



కేకే చౌదరిని సత్కరిస్తున్న రాజంపేట టీడీపీ నాయకులు

రాజంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి కమిటీ చైర్మన్ కేకే చౌదరిని కోడూరులోని ఆయన కార్యాలయంలో రాజంపేట టీడీపీ నేతలు ఆదివారం సత్కరించారు. రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత., టీడీపీ నాయకుడు ఎస్వీ రమణ, చల్లా సుధాకర్‌బాబు, ఉద్దండం సుధాకర్, జనసేన నేత అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


సర్తాజ్ హుసేన్‌కు దేవనాగరి సేవా పురస్కారం

రాజంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హిందీ భాషాభివృద్ధికి కృషి చేసినందుకు ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ దేవనాగరి సమ్మాన్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హైదరాబాదులో దేవనాగరి సమ్మాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మిస్ ఏసియా పూజా నిగం ఈ పురస్కారాలను అందజేశారు. ప్రస్తుతం ఈయన పుల్లంపేట మండలం టి.కమ్మపల్లె హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

భగవద్గీత శ్లోకాల పోటీలు

రాజంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించారు. 6, 7 తరగతుల విభాగంలో శ్రావణ లక్ష్మి, ఎన్.సాయి యోషిత, కె.సాహితి, 8, 9, 10 తరగతుల విభాగంలో వన్యశ్రీ, శివపార్వతి, అన్విత బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో గోపి, గంగనపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీ రామాయణ సంగ్రహం పుస్తకాలను అందజేశారు.

రాజరాజేశ్వరి అలంకారంలో గంగమ్మ



రాజరాజేశ్వరి అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి); కార్తీక అమావాస్య సందర్భంగా స్థానిక ఆలయంలో గంగమ్మ రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి, ముడుపులు చెల్లించారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఓబులమ్మకు పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

సిద్దవటం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ శివారులో ఉన్న ఓబులమ్మ ఆలయంలో ఆదివారం మహిళలు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వన భోజనాల్లో జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ పాల్గొని మాట్లాడారు. పురాతన ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

దరిచేరని అభివృద్ధి

» పూరి గుడిసెల్లోనే నివాసం » రోడ్డు, వీధి దీపాలు లేక అవస్థలు

» వినాయక కాలనీలో గిరిజనుల దుర్భర జీవనం



వినాయక గిరిజన కాలనీ

రైల్వేకోడూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వినాయక గిరిజన కాలనీ అభివృద్ధికి నోచుకోకపోవడంతో అక్కడ నివసిస్తున్న గిరిజన కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించే నాయకులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తైనా చూడడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేకోడూరు మండలం వీవీకండ్రిక పంచాయతీ పరిధిలోని వినాయక గిరిజన కాలనీలో 36 ఇళ్లుండగా 40 కుటుంబాలకు చెందిన సుమారు వంద మంది దాకా నివసిస్తున్నారు. పక్కా ఇళ్లు లేకపోవడంతో పూరిగుడిసెలు వేసుకుని అందులోనే ఎండావానల నుంచి రక్షణ పొందుతున్నారు. వీరంతా వ్యవసాయ పనులు చేసుకుని జీవనం గడుపుతున్నారు. సుమారు ఆరేళ్ల క్రితం ఈ కాలనీ ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్ల మంజూరు చేశామని చెప్పుకున్న అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ తమ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్లు, విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో విష సర్పాల భయం వేధిస్తోందంటున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా పిల్లలను చదివించుకోలేక పోతున్నామని, వ్యవసాయ భూములు ఇవ్వాలని విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదని అంటున్నారు. ప్రస్తుతం కాలనీ చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి కనెక్షన్, కాలనీకి సిమెంట్ రోడ్డు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధి సందర్శించి గిరిజన గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టించాలని కోరుతున్నారు.



కాలనీలోని మట్టి రోడ్డు

సమస్యలు పరిష్కరించండి



కాలనీలో రోడ్లు, కొళాయిలు, లైట్లు లేవు. విష పురుగుల సంచారం అధికంగా ఉండడంతో రాత్రి వేళలో తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు, నాయకులకు విన్నపాలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

-డెక్కిలి సుబ్రహ్మణ్యం

పేదరికంతో సతమతం



కూలి పనులతో వచ్చిన డబ్బు తిండికి సరిపోతోంది.. సబ్సిడీతో రుణాలు ఇచ్చి పక్కాగృహాలు నిర్మించాలి. ఈ ప్రభుత్వమైనా మా గ్రామాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది.

- నాగేశ్వరమ్మ

'ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం'



లక్కిరెడ్డిపల్లె: ర్యాలీలో పాల్గొన్న దేవళంపల్లె వైద్యసిబ్బంది.



రాజంపేట: ఎయిడ్స్ ర్యాలీలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్‌బేగం పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం లక్కిరెడ్డిపల్లె కమ్యూనిటీ ఆసుపత్రి, దేవళంపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కోనంపేట ఆరోగ్యకేంద్రం డాక్టర్లు నజియా, సిద్దయ్య, వైద్యసిబ్బంది ఆయా ఆసుపత్రుల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలోఫర్‌బేగం మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులను ఆదరించి, చేయూతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సులోచన, సుహాసిని, రేఖారెడ్డి, సూపర్వైజర్లు సురేంద్రరెడ్డి, మణి, ఏఎన్ఎంలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సానె శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యాసిన్, అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా సానెశేఖర్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై యువకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య. జయప్రకాష్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నామని ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

ఎయిడ్స్ అనే వ్యాధి అంటువ్యాధి మాత్రమేనని, ఎటువంటి అపోహలు పొందకుండా నిర్మూలనకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని వైద్యసిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్‌వైజర్ బాషా, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో నీరు.. ఆనందంలో రైతులు



చిట్వేలి: నిండుకుండలా ఉన్న ఎల్లమరాజు చెరువు



పుల్లంపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న పుల్లంగేరు

చిట్వేలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి చిట్వేలి మండలంలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జిల్లాలో అతిపెద్ద చెరువు అయిన ఎల్లమరాజుచెరువుకు వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. గుంజనేరుకు కళకళలాడుతోంది. దీంతో రైతులు ఆనందోత్సాహాలతో ఉన్నారు.

పుల్లంపేట : రెండు రోజులుగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి పుల్లంపేటకు ప్రధాన నీటివనరు పుల్లంగేరు నీటితో కళకళలాడుతోంది. ఆదివారం ఉదయం పుల్లంగేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాది పలుసార్లు తుఫాను వచ్చినా పుల్లంగేరులో నీటి చుక్కలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి నీరు ప్రవహిస్తుండడంతో, ఇటు తాగునీటికి అటు సాగునీటికి ఏడాది పాటు ఇబ్బందులు ఉండవు. ప్రస్తుతం మండలంలోని చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించి పోయింది. వ్యాపారులు డీలా పడ్డారు.

రాజంపేట: ఫెంగల్ తుఫాను ప్రభావం రాజంపేట నియోజకవర్గంలో చిరుజల్లులకే పరిమితమైంది. తిరుమలగిరుల్లో భారీ వర్షం కురవడంతో గుంజనేరు, పుల్లంగేరు, పాములేరు కు వరద వచ్చింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెరువులకు నీరు చేరుతోంది. రాజంపేటలో మాత్రం పుల్లంగేరుకు వరద వచ్చినా.. పోలిచెరువు, చక్రాల మడుగుకు నీరందలేదు.

పెనగలూరు: మండలంలో రెండు రోజుల నుంచి తుంపర మాత్రమే కురుస్తోంది. అందువల్ల మండలం లోని చిన్న చిన్న కుంటలతో పాటు చెరువుల్లోకి కూడా నీరు రాలేదు. ఈ ఏడాది గుంజనేరు పారకపోతే రబీ సీజన్‌లో సాగు కష్టమేనని ప్రజలు అనుకుంటున్నారు. ఈ వర్షంతో రోడ్లు, వీధులు, బురదమయమయ్యాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చిట్వేలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావం నేపథ్యంలో చిట్వేలి గ్రామ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని చిట్వేలి ఉపసర్పంచ్ ఉమా మహేశ్వర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున గ్రామంలోని లోతట్టు ప్రాంతాలైన తోపువీధి, బ్రాహ్మణవీధి, గాజులవీధి, కొత్తబస్టాండు, పాతచిట్వేలి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. చిట్వేలి ప్రజలకు అత్యవసర సమాచారం కోసం చరవాణి ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ప్రజా దర్బార్‌లో సమస్యలు పరిష్కరించుకోండి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రెడ్డెయ్య

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనం ఆవరణలో ప్రజాదర్బార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి హాజరవుతారని, ప్రజలు తమ అర్జీలను సమర్పించి సమస్యలు పరిష్కరిం చుకోవచ్చునన్నారు. అర్జీదారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు మండల యువ నాయకుడు యనమల మదన్ మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సంఘం కార్య నిర్వహణ కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామరాజు, మండల యువజన నాయకుడు పక్కీరయ్య, ముక్తార్‌అహ్మద్, మహ్మద్ అంజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: రామాపురం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని ఎంపీడీవో జాషువా తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రజలు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొస్తే అధికారుల సమక్షంలో పరిష్కరిస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బండిపల్లి హరిజనవాడలో బోరు ప్రారంభం



బోరు పనులు ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లె హరిజనవాడలో ఆదివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు గజమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

● రాష్ట్ర ఖాదీ కార్పొరేషన్ చైర్మన్ కేకే చౌదరి, అడా చైర్మన్ ముక్కా



ముక్కా రూపానందరెడ్డి, కేకే చౌదరికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

రైల్వేకోడూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు రాజ్ కన్వెన్షన్‌లో ఆటో నగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరులో ఆటోనగర్‌కు స్థలాన్ని కేటాయించి, కార్మికులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. ఆటోనగర్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు లోక నాథం ఆచారి మాట్లాడుతూ సొంత స్థలాలు లేకపోవడంతో 30 ఏళ్లుగా ఆటోనగర్ కార్మికులు స్థలాలను లీజుకు తీసుకుని ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆటోనగర్ కు స్థలాన్ని కేటాయించాలని 20 ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఆటోనగర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు తక్షణ పరిష్కారం

సంబేపల్లె, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): దుద్యాల గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నట్లు దుద్యాల సర్పంచ్ ఎద్దుల లక్ష్మీదేవి, ఆమె భర్త చిన్నప్ప తెలిపారు. ఆదివారం పెద్దజంగంపల్లిలో తాగునీటి బోర్లకు స్టార్టర్లను బిగించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించడమే తమ కర్తవ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివప్రసాద్, దేవేంద్ర, శంకరయ్య, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖర్

సిద్దవటం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాచుపల్లె - కడప రహదారిపై శనివారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టిచర్యలు తీసుకుంటున్నామని, ఎక్సైజ్ పరిధి ఒంటిమిట్ట, అట్లూరు, సిద్దవటం మండలాల్లో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఈ కార్యక్రమంలోఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కూలిపోయిన రక్షణగోడ

చిట్వేలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి - రాపూరు మార్గంలోని ఘాట్ రోడ్డులో మూడో మలుపు వద్ద రక్షణ గోడ కూలిపోవడంతో వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ మలుపులో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించే అవకాశాలు లేవు. దీంతో ఈ ప్రాంతంలో భారీ వాహనాలు వేగం నియంత్రించలేక ప్రమాదం బారిన పడే అవకాశాలున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో పలు ప్రమాదాలు జరగడంతో వాహనదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే రక్షణగోడ నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

తుఫాన్ బాధితులకు కూరగాయల పంపిణీ



కూరగాయలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు సుబ్బరాజు

ఓబులవారిపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మవరం పంచాయతీ పరిధిలో మారుమూలన ఉన్న బీపీ రాజుపల్లె కంసాలమ్మ ఎస్టీ కాలనీలో సుమారు 20 కుటుంబాల ప్రజలు నాలుగు రోజులుగా వర్షాల కారణంగా అడుగు బయట పెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఆ గ్రామానికి సక్రమంగా దారి కూడా లేకపోవడంతో గుట్టకు వెళ్లి రాయి కూడా కొట్టలేని పరిస్థితి ఏర్పడిందది. విషయం తెలుసుకున్న బొమ్మవరం టీడీపీ నాయకులు ఉమ్మలరాజు పిచ్చిరాజు కుమారుడు ఉమ్మలరాజు సుబ్బరాజు నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు మాట్లాడుతూ ఆధార్, రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నామని సాయం చేయాలని కోరారు. ఈ విషయం వైరల్ కావడంతో నాయకులు, అధికారులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీపీ రాజుపల్లె కంసాలమ్మ ఎస్టీకాలనీ గ్రామస్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు నాగవరం విద్యార్థిని



క్రీడాకారిణి సుమతో ప్రధానోపాధ్యాయురాలు

చిట్వేలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగవరం జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని వైసుమ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పీడీ ప్రమీల ఆదివారం తెలియజేశారు. గత నెల 29 నుంచి 30 వరకు చిత్తూరు జిల్లా పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ఉత్తమ ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు.

4 నుంచి భగవద్గీత ప్రవచనాలు

నందలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లె శ్రీకృష్ణ గీతా మందిరంలో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు కడప పట్టణానికి చెందిన అచ్చోలి ముకుందారెడ్డి భగవద్గీతపై ప్రవచనం చేస్తారని విశ్రాంత తహసీల్దారు నాయనపల్లి జయన్న తెలిపారు.. 11న గీతాజయంతి సందర్భంగా మధ్యాహ్నం అన్నదానంతోపాటు భగద్గీత గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



బాలపల్లె అటవీ ప్రాంతంలో ప్రయాణికులకు కనువిందు చేస్తున్న జలపాతం

కొండా కోనల్లో...

తిరుమలగిరుల నుంచి జాలువారిన నీరు
జలపాతమై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రైల్వేకోడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల గిరుల నుంచి వర్షపునీరు జాలువారుతున్నాయి. కొండాకోనలు దాటి రైల్వేకోడూరు పరిసర కొండల్లో జలపాతమై పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా తిరుమలగిరిలోని జలాశయాలు పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధారల్లో ఆదివారం ఉధృతంగా వరద నీరు చేరడంతో రైల్వేకోడూరు అడవుల్లో ఎక్కడ చూసినా వరద నీటి ప్రవాహం చూపురులను ఆకట్టుకుంటున్నాయి. నీటి గలగల శబ్దాలు వినసొంపుగా ఉన్నాయి. జలాశయాలు పూర్తి స్థాయిలో వరద నీరు చేరడంతో పొంగిపొర్లుతున్నాయి. అక్కడి నుంచి వెలుగొండ, శేషాచలం అడవుల నుంచి రైల్వేకోడూరు మండలం బాలపల్లె అటవీ ప్రాంతంలో వరద నీరు జలపాతాల్లా ప్రవహిస్తున్నాయి. ఈ జలపాతాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ముందస్తు చర్యగా రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తన సిబ్బందితో ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. తిరుమలలోని పాపవినాశనం డ్యాంలో 693.27 మీటర్లకు 697.14 మీటర్ల వరకు వరద నీరు చేరింది. గోగర్భం డ్యాంలో 2894 అడుగులకు 2894 అడుగులు నిండింది. ఆకాశగంగ డ్యాం 855.0 మీటర్లకు 865.00 అడుగులు నిండింది. కుమారధార డ్యాం లో 890.80 మీటర్లు, పసుపుధార డ్యాం 896.35 మీటర్లకు 898.24 మీటర్ల వరకు నీరు చేరిందని సంబంధిత అధికారు లు తెలిపారు. వర్షం తగ్గకపోవడంతో అడవుల్లో వరద నీరు పెరుగుతూ ఉంది.

'సాగర్' కాల్వలకు మోక్షమెప్పుడు?



మొరాయించిన తూము గేట్లు ● మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం
కాల్వల్లో పెరిగిన చెట్లు ● పూర్తికాని కుడి కాల్వ పనులు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు ఎడమ, కుడికాల్వల మరమ్మతులకు మోక్షం వచ్చినట్లులేదు. గురువారం హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు తూము గేట్లు మరమ్మతు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా ఇప్పటికే వ్యవసాయానికి నీరు వదలడంతో కుడికాల్వ వెంబడి 230 క్యూసెక్కులు, ఎడమ కాల్వ వెంబడి 400 క్యూసెక్కులు నీరు పారుదల ఉంది. ప్రస్తుతం తూమర గేట్లు మొరాయించడంతో కుడికాల్వ ద్వారా పోయే నీరు ప్రస్తుతం చెరువుల్లోకి వెళుతున్నాయి. చెరువులు నిండిన వెంటనే పంట పొలాల్లోకి పోతాయని, పంటలు నాశన మవుతాయని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. వేసవిలో రైతన్నలకు నీళ్లు అందాలంటే ప్రస్తుతం మొరాయించిన బ్రహ్మం సాగర్ గేట్లకు మర మ్మతులు చేపట్టాలని రైతన్నలు కోరుతున్నారు. వివరాల్లోకెళితే.... బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద దాదాపు లక్షా 80వేల ఎకరాలు సాగులోఉంది. కొత్తూరు, పాతూరు, నరసన్నపల్లె, ముదిరెడ్డిపల్లె, సొదరివారిపల్లె ఆత్మ మం గంగిరెడ్డిపల్లె దిగువ నేలటూరు, మల్లేపల్లె ల్లో ఏటా రెండు దఫాలుగా పైర్లు వేస్తుంటారు. పంటలకు నీటిని సరఫరా చేసే పిల్లకాల్వలు లేకపోవడంతో సాగునీరు అందడంలేదని రైతన్న లు వాపోతున్నారు. ప్రస్తుతం బ్రహ్మంసాగర్ ప్రాజెక్టులో 11 టీఎంసీలు నీరున్నా సమయానికి పంటలకు నిరందని పరిస్థితి. మెయిన్ కాల్వ వెంబడి నీళ్లు వెళుతున్నా సకాలంలో పంటకు నీరందడంలేదు. ఎడమ కాల్వ వైపు ఉన్న చెరవ లకు నీళ్లు అరకొరగా వెళుతున్నా కుడికాల్వ వైపు ఉన్న కాల్వ వెంబడి నీళ్లు వృధాగా వెళుతున్నాయి. ఇక్కడ పిల్లకాల్వల పనులే ఇందుకు అడ్డంకిగా చెప్పవ చ్చు. ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా పంటలకు సంతృప్తికరంగా నీళ్లు అందడంలేదని రైతులు బాధపడుతున్నారు. ఈ విషయంపై రైతులు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం సాగర్ కుడికాల్వ తూముగేట్లు మరమ్మతులకు గురవడంతో నీళ్ల వృధాగా వెళ తున్నాయి. ప్రస్తుతం వరి పంట చేతికి వస్తున్న తరుణంలో కుడికాల్వ ద్వారా పారుదలయ్యే నీరు పొలాల్లోకి వస్తాయని ఆందోళనకు గురవుతున్నారు. తెలుగుగంగ అధికారులు పదిరోజులుగా గేట్ల మరమ్మతులు చేపట్టినా కూడా ఫలితం దక్కలేదు. బ్రహ్మంసాగర్ నిండు కుండలా ఉన్నా పంటలకు నీరందడం లేదని మరోవైపు బ్రహ్మంసాగర్ కుడివైపు తూము గేట్లు మొరాయించడంతో నీళ్లు వృధాగా పోతున్నాయని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కుడికాల్వ తూము గేట్లు మరమ్మతులు చేపట్టాలని, మెయిన్ కెనాల్ కాల్వ వెంబడి పంట పొలాల్లోకి వెళ్లే చిన్న కాల్వల పనులు చేయించాలని రైతన్నలు కోరుతున్నారు.



గేటు మరమ్మతు పనులు చేయిస్తున్న అధికారులు



కంపచెట్లతో నిండి ఉన్న చిన్నకాల్వలు



అసంపూర్తిగా కాల్వలు

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్
రూ.12.5 లక్షల విలువైన నగదు స్వాధీనం



అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసిన రాజంపేట డీఎస్పీ సుధాకర్, సీఐలు

రాజంపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజంపేట, చిట్వేలి పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగలను ఎట్టకేలకు రాజంపేట, రైల్వేకోడూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ఎన్.సుధాకర్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా బిట్రగుంట కప్పరాల తిప్ప వాసి పీట్ల మహేష్, పీట్ల శరీస్‌కుమార్ అక్టోబరులో కె.శ్రీనివాసులు స్థానిక ఐడీబీఐ బ్యాంకులో కుదువ పెట్టిన బంగారాన్ని విడిపించుకుని తీసుకువస్తున్న క్రమంలో రెక్కీ చేసి స్కూటీలో ఉన్న డబ్బు, బంగారాన్ని దొంగలించారు. చిట్వేలిలో కూడా బ్యాంకు వద్ద రెక్కీ చేసి బంగారం దొంగలించారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు పట్టణ సీఐ ఎల్లంరాజు, రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, చిట్వేలి ఎస్ఐ కె.రఘురాం, సిబ్బంది వారిని పట్టుకున్నారు. వారి నుంచి 132 గ్రాముల బంగారం, రూ.3.10 లక్షల నగదు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12.5 లక్షలు ఉంటుందని తెలిపారు. గతంలో వీరు అనేక జిల్లాల్లో ఇతర రాష్ట్రాల్లోనూ నేరచరిత్ర ఉందని, పలు కేసుల్లో నిందితులని డీఎస్పీ తెలిపారు.

టీడీపీ నేతలపై కత్తులతో దాడి - ఒకరికిగాయాలు



చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

ముద్దనూరు డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక పులివెందుల రోడ్డులోని టీ కహాని సమీపంలో ఆదివారం సాయంత్రం బైకులో వెళుతున్న వేల్పుచర్ల టీడీపీ నేతలను అదే గ్రామ వైసీపీ నేతలు కత్తులతో దాడి చేయగా టీడీపీకి చెందిన గంగరాజు ఎడమ కాలికి తీవ్రగాయమైంది. బాధితుడు సమాచారం మేరకు వివల్లోకెళితే...

కొద్ది రోజుల కిందట వైసీపీకి చెందిన ఈశ్వరయ్య జీవాలు దొంగలు తీసుకెళ్లారు. ఈవిషయమై మా బంధువైన ఓబులేసు, ఈశ్వరయ్య, అతని కొడుకు శివకృష్ణ జీవాలు దొంగలించింది నీవేనని బెదిరిస్తూ వేధిస్తున్నారు. ఆదివారం వెల్పుచర్లలో ఇంటికి వెళుతుండగా ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు కారంపొడితో దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు దాడికి దిగాయి. పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకుని ఇరువర్గాలను అదుపు చేశారు. ఇరువర్గీయులూ స్టేషన్‌రావాలని పోలీసులు తెలపడంతో ఓబులేసుతో కలిసి బైకులో వస్తుండగా టీకహాని వద్ద ఈశ్వరయ్య అతని కొడుకు మరి కొందరు వైసీపీ నేతలు బొలేరో వాహనంతో బైకు వెనుక వైపున ఢీకొట్టారు. వెంటనే వాహనంలో తెచ్చిన కత్తులతో కిందపడిన వారిపై దాడి చేశారు. ఓబులేసుకు స్వల్పగాయాలవగా, గంగరాజు కాలికి తీవ్రగాయమైంది. ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి

అనుమానం వ్యక్తం చేసిన మృతుడి భార్య ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ లింగప్ప



వసంతకుమార్ మృతదేహం

జమ్మలమడుగు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నుంచి శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో మోటారు సైకిల్ పక్కనే మేకా వసంతకుమార్ (27) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు ఎస్‌పీజీ క్వార్టర్స్ వాసి వసంతకుమార్ కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మ్మలమడుగు నుంచి కడపకు వెళ్లి తిరిగి జమ్మలమడుగు వస్తాడు. అయితే రాత్రి 12 గంటలకు ఇంటి నుంచి బుల్లెట్ సైకిల్‌పై (రాళ్లగుండ్లకుంట) శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలో వెళ్లాడు. అక్కడ కేవలం తలకు, ముఖానికి రక్తగాయాలై ఘటనా స్థలంలోనే మృతిచెంది పడి ఉన్నాడు. ఆదివారం ఉదయాన్నే తెల్లవారుజామున ఆ వైపున వాకింగ్‌కు వెళ్లేవారు సమాచారం ఇచ్చారు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు రామక్రిష్ణ, కల్పన, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న మృతుని బంధువులు ఆస్పత్రి వద్దకు వెళ్లి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతునికి భార్య వసుంధర, కుమారుడు ఉన్నాడు. తన భర్త మృతికి గల కారణాలు తెలియాలని, అనుమానం ఉన్నట్లు మృతుని భార్య అర్బన్ పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

స్థలాన్ని పరిశీలించిన దిశ డీఎస్పీ



విచారణ చేస్తున్న కడప దిశ డీఎస్పీ రమాకాంత్

కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌బజార్‌లోని ఓ స్థలం విషయమై కడప దిశ డీఎస్పీ రమాకాంత్ ఆదివారం విచారణ చేపట్టారు. చౌటిపల్లె వాసి వెంకటేశ్వర్లు స్థలం విషయమై ముద్దనూరు మండలం కొర్రపాడు వాసులు శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి కులం పేరుతో దూషించారని పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక మెయిన్‌బజార్‌లో ఉన్న స్థలాన్ని పరిశీలించి డీఎస్పీ స్థానికులను విచారించారు. కార్యక్రమంలో కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ, ఎస్ఐ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామచంద్రనగర్ వాసి, టీడీపీ కార్యకర్త కుడుముల నాగేశ(55) ఆదివారం తెల్లవారుజామున ఇంటి మెట్ల నుంచి జారిపడి మృతి చెందాడు. ఇంటి డాబా నుంచి మెటికలు దిగుతూ ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో ఇతని తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఇతన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. నాగేశ స్థానికంగా గాలిమిషన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గోరిశెట్టి బాబు, బుజ్జి తదితర టీడీపీ నేతలు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

జాతీయ జట్టుకు అరుణ ఎంపిక



కడప స్పోర్ట్స్, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ 2024 అండర్-20 మహిళా జాతీయ స్థాయి ఫుట్‌బాల్ ట్రయల్స్‌కు జిల్లా నుంచి తమటపు అరుణ ఎంపికైంది. ఈనెల 10న బెంగుళూరులో ఏఐఎఫ్ఎఫ్ ఫుట్‌బాల్ ట్రయల్స్‌కు రాష్ట్రంలో ఇద్దరు ఎంపికయ్యారు. ఇందులో కడప జిల్లా నుంచి అరుణ, అనంతపుర జిల్లా నుంచి మందల అనూష ఎంపికైనట్లు ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శ్రీధర్ వెల్లడించారు.

'మధ్యంతర భృతి ప్రకటించాలి'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పీఆర్సీ ఇస్తానని చెప్పిన మాటను సీఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులకు ఐదేళ్లుగా డీఏ బకాయిలు జమ కాలేదని వాటిని వెంటనే ఉద్యోగుల ఖాతాకు జమ చేయాలని కోరారు. ప్రభుత్వం పీఆర్సీ కమిటీ వేగవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకుని నివేదికను సత్వరం తెప్పించుకుని అమలు చేయాలని, ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీయపురెడ్డి వెంకట జనార్ధనరెడ్డి సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

రైలు ఢీకొని వృద్ధునికి గాయాలు



చికిత్స పొందుతున్న గోపాల్

కొండాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటిపల్లె- ఓబుళాపురం మధ్యలో ఆదివారం రైలు ఢీకొనడంతో వృద్ధునికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గుంటూరు జిల్లాకు చెందిన గోపాల్ రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొంది. ఈ సంఘటనలో కాలు, చేయి విరిగినట్లు సమాచారం. ఇతన్ని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

'కరెంటు చార్జీల భారం తగదు'



వేంపల్లె, డిసంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై కరెంటు చార్జీల భారం శోచనీయమని కాంగ్రెస్ ముఖ్యఅధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఎన్నికల ముందు చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచాలనుకోవడం దురదృష్టకరమన్నారు. ప్రజలను మోసం చేయడం తగదన్నారు. ఇటీవలే సర్దుబాటు పేరుతో రూ.6వేల కోట్లు భారం వేశారని, మళ్లీ ఇపుడు రూ.9వేలకోట్లు భారం వేయడం ప్రజలను వంచించడమేనన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రజలపై కరెంటు చార్జీల భారం లేకుండా చూడాలని తులసిరెడ్డి హితవు చెప్పారు.

అదుపు తప్పి బోల్తా పడిన బస్సు

● కారును ఢీకొని...
● పలువురికి తీవ్ర గాయాలు ● తిరుపతికి ఇద్దరి తరలింపు

కురబలకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న బస్సును వెనుక నుంచి వస్తున్న కారు అధిగమిస్తుండగా బస్సు అదుపు తప్పి కారును ఢీకొనడంతో పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరు పతికి తరలించారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాలిల్లోకెళితే....

కనిగిరి నుంచి బెంగళూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు కురబలకోట ఫ్లైఓవర్ వద్ద వెళుతోంది. కడప రోడ్డు నుంచి మదనపల్లె వైపు (వెనుక భాగం) నుంచి వస్తున్న కారు ముందు వెళుతున్న బస్సును అధిగమిస్తుండగా ప్రమాదవశాత్తు బస్సు కారును ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదంలో చిన్నయ్య, కొండమ్మ, బావాజీ, బెంగళూరుకు చెందిన వెంకటరమణ, కనిగిరి వాసులు లేయమ్మ, సాలెమ్మ, మాలకొండయ్య గాయపడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులకు వైద్యులు చికిత్స నిర్వహించారు. కాగా లేయమ్మ, మాలకొండయ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ముదివేడు పోలీసులు సం ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రమాదంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు.





రోడ్డు ప్రమాదంలో బోల్తాపడిన బస్సు - క్షతగాత్రులను చికిత్సకు తరలిస్తున్న దృశ్యం

రేషన్ కార్డులు, పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పేదలకు కొత్తరేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేస్తోందని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలకే అర్హులైన పేదలకు రేషన్‌కార్డులు పింఛన్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. సోమవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. సంక్రాంతి కానుకగా అర్హులకు జనవరిలో కొత్తకార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

కడప క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్‌నగర్‌లో ఓ వృద్ధురాలు మెడలోని గొలుసును గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఒంటరిగా ఉన్న వృద్ధురాలి వద్దకు వచ్చి పింఛను ఇప్పిస్తామంటూ చెబుతూ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లి పారిపోయారు. ఈ మేరకు చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో వృద్ధురాలి బంధువులు ఫిర్యాదు చేశారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సుమ ఎంపిక



సుమతో ప్రధానోపాధ్యాయురాలు

చిట్వేలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగవరం జడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని వై.సుమ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పీడీ ప్రమీల తెలియజేశారు. గత నెల 29 నుంచి 30 వరకు చిత్తూరు జిల్లా పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు.

ఘనంగా భస్మార్చన

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం ఘనంగా భస్మ హారతి ఇచ్చారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పూలమాలలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌ను వేద పండితులు భస్మంతో అభిషేకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈవో రామచంద్రాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ కలపకు అడ్డుకట్టవేయరా..?

- భారీగా తరలిపోతున్న వృక్ష సంపద
- చోద్యం చూస్తున్న అధికారులు
- పర్యావరణానికి పెనుముప్పుగా మారిన వైనం
- ఆందోళనలో పర్యావరణ నిపుణులు

గుర్రంకొండ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):మండలంలో కలప అక్రమ రవాణాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. దీంతో కొందరు వృక్ష సంపదను నిలువునా నరికేస్తూ పచ్చదనం లేకుండా పర్యావరణానికి ముప్పు వాటిల్లేలా చేస్తున్నారు. ఈ అక్రమార్కుల దాటికి విలువైన వేప, టేకు, మామిడి, చిగురు, మర్రి, చింత, నిలగిరి, ఊడుగ, రోజ్‌వుడ్ తదితర వృక్షాలు నేలకొరుగుతున్నాయి. పగటి పూట వృక్షాలను యంత్రాలతో కత్తరించి చీకటి పడగానే ట్రాక్టర్లలో సా మిల్లులకు, బట్టీలకు తరలిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ఉన్న భారీ వృక్షాలను కొందరు నాయకులు గుట్టుచప్పుడు కాకుండా కత్తరించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రతి రోజు పదుల సంఖ్యలో కలప ట్రాక్టర్లు అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల కళ్లముందు వెళ్లుతున్న పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విలువైన కలప ఇటుక బట్టీల్లో బూడిదగా మిగులుతోంది. గుర్రంకొండ మండలంలోని ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లె, నడిమిఖండ్రిగ, శెట్టివారిపల్లె, తరిగొండ, మర్రిపాడు, సంగసముద్రం, రామాపురం గ్రామాల్లో అటవీ ప్రాంతం అధికంగా ఉంది. ఈ అటవీ ప్రాంతాల్లో విలువైన భారీ కలప వృక్షాలున్నాయి. అంతేకాకుండా రైతుల పొలాల్లో కూడా వివిధ రకాల కలప వృక్షాలున్నాయి. ఈ వృక్షాలను కలప వ్యాపారులు పగటి పూట యంత్రాలతో నరికేస్తున్నారు. సాయంకాలం చీకటి పడగానే ట్రాక్టర్లలో పదుల సంఖ్యలో ప్రతి రోజు సామిల్లులు, ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సరిమడుగు, చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె, సంగసముద్రం, గుర్రంకొండ, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, తల్లారివాండ్లపల్లె గ్రామాల నుంచి ప్రతి రోజు ట్రాక్టర్లలో కలపను తరలిస్తున్నా అటవీశాఖ అధికారులకు తెలిసిన చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నా విమర్శలున్నాయి.



టి.పసలవాండ్లపల్లె వద్ద పెద్ద పెద్ద వృక్షాలను ఇష్టానుసారంగా నరికి దుంగలుగా కత్తిరించివేసిన దృశ్యం

ట్రాక్టర్ లోడ్ కలపకు సొమ్ము ఇవ్వాల్సిందే..

గుర్రంకొండ పట్టణంలోని సామిల్లులకు ట్రాక్టర్ లోడ్ కలప తరలించాలంటే మామూళ్లు చెల్లించాల్సిందే. వివిధ రోడ్డు మార్గాల గుండా ప్రతి రోజు ఎన్ని ట్రాక్టర్లు కట్టెల లోడ్‌తో వస్తున్నాయో వ్యాపారులే లెక్కిస్తారు. సాయంకాలం ఆ రోజు వచ్చిన ట్రాక్టర్ల నుంచి సొమ్ము వసూలు చేసి సంబంధిత శాఖ అధికారులకు ముట్టచెబుతున్నారు. దీని కోసం వ్యాపారులే దళారులుగా మారారు. అంతేకాకుండా ఇక్కడ నుంచి మదనపల్లె, బయట ప్రాంతాలకు కలపను తరలించడానికి వాహనాన్ని బట్టి వివిధ రేట్లును విధించినట్లు సమాచారం. అధికారులు నియమించిన వ్యక్తులే మామూలాను వసూలు చేసి చేరవేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

అక్రమంగా కలప తరలిస్తే చర్యలు తప్పవు

అక్రమంగా కలపను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. అంతేకాకుండా ప్రభుత్వ భూముల్లో ఉన్న చెట్లను కూడా కత్తిరించి తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా వృక్షాలను నరక రాదు. అటవీశాఖ అధికారుల పేరిట మామూళ్ల వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పర్యటించి పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించి పర్యావరణాన్ని రక్షిస్తాం.

-రామ్‌మోహన్, అటవీశాఖ
బీట్ ఆఫీసర్, గుర్రంకొండ



ఔను! నిజమే అది చెరువుకాదు. వాల్మీకిపురం పట్టణంలోని తిరుపతి జాతీయ రహదారి. పట్టణంలో కాసింత వర్షం కురిస్తే చాలు ప్రధాన రహదారి వర్షపునీరు నిలిచి వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డు పక్కన డ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక గ్రామీణ ప్రాంతాల రోడ్ల గురించి చెప్పనలవికాదు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

-వాల్మీకిపురం, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా లింగోద్భవ మహాశివుడికి అన్నాభిషేకం



లింగోద్భవ మహాశివుడు

వాల్మీకిపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా లింగోద్భవ మహాశివుడికి వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయంలోని లింగోద్భవ మహాశివుడికి అభిషేకం, అర్చన ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం విశేష అలంకరణలు గావించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈకార్యక్రమాలలో షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

4న అయ్యప్ప పడిపూజ

మదనపల్లె అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక చిప్పిలి గ్రామంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీన కేరళ మనోజ్ తంత్రి ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నదాన వితరణ చేశారు. అనంతరం ఆలయకమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు జర్మన్‌రాజు, భగవాన్, హేమంత్, కేశవ, ఫోస్టాఫీస్ రమణ, అమర, శివమూర్తి, వాసు,పాల్గొన్నారు.

రాజరాజేశ్వరిగా గంగమ్మతల్లి



లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి); కార్తీక అమావాస్య సందర్భంగా స్థానిక ఆలయంలో గంగమ్మ రాజరాజేశ్వరి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి, ముడుపులు చెల్లించారు. ఆలయ సిబ్బంది భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎవరులేని వారికి మేమున్నాం అంటూ సొంత ఖర్చులతో అనాథ శవాలకు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు అంత్యక్రియలు చేశారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన నరసింహులు, సూర్యనారాయణలను మార్చురీలో ఉంచగా వారి బంధువులు ఎవ్వరూ రాకపోవడంతో మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్ వారు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులకు తెలియజేశారు. వారు వచ్చి అనాథ శవాలకు దహన సంస్కారాలు, హిందూసాంప్రదాయ బద్ధంగా హిందూ శ్మశాన వాటికలో నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్‌మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్, సభ్యులు కిరణ్, ముఫీ, జైనుల్లా, గౌస్, అర్బాజ్, అంబులెన్స్ కమల, రఘు, నూరి పాల్గొన్నారు.

రైతన్నలకు తీవ్ర నష్టం మిగిల్చిన వర్షం



నిమ్మనపల్లెలో తుఫాన్ ధాటికి నేల వాలిన వరిపంట



పీలేరు బిస్మిల్లా నగర్‌లో కూలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నిమ్మనపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతన్నలకు తీవ్ర నష్టాలను మిగిల్చాయి. పండించిన వరి పంట నీటమునిగింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురియడం మండలంలోని పలు ఇళ్లు ఉరుస్తున్నాయి. ఇదిలా ఉండగా వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం మండలంలోని రైతులు 1200 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా ఇప్పటికే 60శాతానికి పైగా పంటను కాపాడుకున్నారని మిగిలిన450 ఎకరాల్లోని వరి పంట తుఫాన్ ధాటికి మొత్తం వాలిపోయిందన్నారు. అంతే కాకుండా మరో రెండు రోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖా తెలుపడంతో మండలంలో 70ఎకరాల్లో వున్న టమాటా పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. చేతికివచ్చిన పంట తఫాన్ ధాటికి నేల మట్టం కావడంతో ప్రభుత్వమే తమను అన్ని విధాల ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

పీలేరులో: ఫెంగల్ తుఫాను కారణంగా పీలేరులో శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. పెద్దగా ఆస్తి, పంట నష్టం జరుగక పోయినా స్థానిక బిస్మిల్లా నగర్‌లోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది హుటాహుటిన మరమ్మతు చేపట్టి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. సదుం, సోమల మండలాల్లో కురుస్తున్న వర్షాలకు పింఛా నదిలో నీటి ప్రవాహం పెరిగింది. దీంతో కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్‌కు నీటి కొరత తీరనుందని టీడీపీ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. పీలేరు-మదనపల్లె మార్గంలోని బడబళ్లవంకపై నిర్మించిన చెక్ డ్యామ్ నిండి మొరవపోతోంది.

తంబళ్లపల్లెలో ఓ మోస్తరు వర్షం

తంబళ్లపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావం కారణంగా తంబళ్లపల్లెలో ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారుజాము నుంచి ముసురు అలముకుని ఎడతెరపిలేకుండా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. శీతాకాలంకు తోడు తుపాను ప్రభావంతో చలిగాలులు తీవ్రమయ్యాయి. దీంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు ఇళ్లకే పరిమితమవ్వగా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కాగా, తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలు వరి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే మండలంలో సుమారు 80 శాతం పైగా వరి కోతలు పూర్తవ్వగా..ఇంకా కొంత వరకు వరి పంట కోత దశలో ఉంది. తుపాను కారణంగా భారీ వర్షాలు కురిస్తే వరి పైరు నేల వాలి ధాన్యం మొలకలొచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెద్దమండ్యంలో: తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయం ఉరుస్తోంది. కార్యాలయ భవనంలోని గదులన్నీ ఉరుస్తుండడంతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఇక్కట్లు పడుతున్నారు. వీడియో కాన్ఫరెన్స్ గది, కంప్యూటర్ గది పూర్తిగా ఉరుస్తున్నాయి. వాటితో పాటు కార్యాలయ పైకప్పు పెచ్చులు విరిగి పడుతున్నాయి. కాగా మండలంలో పలు ప్రభుత్వ పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ భవనాలు ఉరుస్తున్నాయి. జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



జవహర్‌నవోదయ విద్యాలయంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి):స్థానిక మండలం వలసపల్లె లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం 13వ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. మొదటి బ్యాచ్ నుంచి 32వ బ్యాచ్ వరకు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు పాల్గొని పాత స్మృతులను నెమరు వేసుకున్నారు. అప్పట్లో వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. 13వ బ్యాచ్ విద్యార్థులు విద్యాలయంలో మల్టీపర్పస్ హాల్‌ను నవీకరించారు.ఈ అభివృద్ధికి ప్రతీకగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఏడో బ్యాచ్ విద్యార్థులు అర్థవార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన 6వ తరగతి నుంచి 12 వ తరగతి వరకు విద్యార్థులకు ప్రథమ రూ. 2000,ద్వితీయ రూ. వెయ్యి, తృతీయ బహుమతి రూ.500లు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేలాయుధన్, జవహర్ నవోదయ బెంగళూరు రూరల్ ప్రిన్సిపాల్ ఆర్, చక్రవర్తి, నవోదయ పూర్వపు, ప్రస్తుతం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే హెచ్‌ఐవీ రహిత సమాజం



ఎయిడ్స్ ఆకారంలో విద్యార్థినుల మానవహారం

కలికిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యువత అప్రమత్తత కారణంగానే హెచ్‌ఐవీ రహిత సమాజం సాధ్యమవుతుందని స్థానిక ప్రభుత్వ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్. అంజలీదేవి తెలిపారు. కళాశాల ఆవరణలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ సంక్రమణ విధానాలు, నివారణ పద్ధతులు, చికిత్సా విధానాల గురించి ఆర్ఆర్‌సీ సంస్థ నిర్వాహకులు శ్వేత, పల్లవి అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, వైస్ ప్రిన్సిపాల్ గులాబ్‌జాన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఫేస్ పెయింటింగ్, పెయింటింగ్, వ్యాసరచన, షైమ్ రీల్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం ఎయిడ్స్ సింబల్ ఆకారంలో మానవ హారం ఏర్పాటు చేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గులాబ్‌జాన్, అధ్యాపకులు కె. మాధవి, లిఖిత, జి. మాధవి, హాజీరా, శైలజ, కీర్తి, అనూష, విద్యార్థినులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో:స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆదివారం హెచ్‌ఐవీ ఎయిడ్స్ కంట్రోల్ విభాగం సిబ్బంది పుల్లయ్యానాయుడు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించడానికి ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. కార్యక్రమంలో పుల్లయ్యానాయుడు, వేణుగోపాల్, జనచేతన వెంకటేష్ ,ఎయిడ్స్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆరోగ్య ఉపకేంద్రం



మల్లెల గ్రామంలో ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడిఉన్న ఆరోగ్య ఉపకేంద్రం

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల గ్రామంలో గత 12 ఏళ్ల క్రితం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని లక్షలు వెచ్చించి ప్రభుత్వం నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోకుండానే నిరుపయోగంగా పడిఉంది. మల్లెల గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం ఉంటే ఇటు సంపతికోట, బూచిపల్లె, మల్లె గ్రామ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ ఆరోగ్య ఉపకేంద్రం లేకపోవడంతో ప్రజలు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఎదురైతే 20 కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారు లు ఈ ఆరోగ్య ఉపకేంద్రంపై దృష్టి సారించి ప్రజాఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా దర్బార్‌లో సమస్యలు పరిష్కరించుకోండి

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనం ఆవరణలో ప్రజా దర్బార్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వ హించనున్న ఈ కార్యక్రమానికి మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి హాజరవుతారని, ప్రజలు తమ అర్జీలను సమర్పించి సమస్యలు పరిష్కరిం చుకోవచ్చునన్నారు. అర్జీదారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు మండల యువ నాయకుడు యనమల మదన్ మోహన్ తెలిపారు.

ఘనంగా శంకర్‌యాదవ్ జన్మదిన వేడుకలు



పేదలకు అన్నదానం చేస్తున్న తెలుగు యువత ఉపాధ్యక్షుడు టి.సుదర్శన్‌రెడ్డి



ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ములకలచెరువు/తంబళ్లపల్లె, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వ హించారు. ఆదివారం రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ నేత టి. సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకు కట్ చేసి పార్టీ నాయకులు, కార్య కర్తలకు, అభిమానులకు, ప్రజలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ నేత టి. సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు పురుషోత్తం, వెంకట రెడ్డి, పెద్దమండ్యం టీడీపీ మండలాధ్యక్షుడు బిల్డర్ రమణ, గంగరాజు, ఎస్ఎంసీ చైర్మన్లు వీరాంజినేయులు, మ్యూజికల్ శివ, గంగులరెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్, సోముశేఖర్, బాలకృష్ణారెడ్డి, నాగభూషణం, సుబహాన్, రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధికార ప్రతినిధి ముత్తుకూరు మౌళా, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా పెద్దమండ్యం, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో ఆయన వర్గీయుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు...ప్రయాణికుల ఇబ్బందులు

ములకలచెరువు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మీదుగా నడిచే రైళ్లు ఆదివారం ఆలస్యంగా నడిచాయి. సికింద్రాబాద్ జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 5.54 గంటలకు వచ్చింది. ఈ రైలు మూడు గంటలకు పైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే మదనపల్లె రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 6.25 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 6.55 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 7.10 గంటలకు, తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సి ఉండగా 9.03 గంటలకు వెళ్లింది. అలాగే తిరుపతి నుంచి గుంతకల్లు జంక్షన్‌కు నడిచే రాత్రి ప్యాసింజర్ రైలు కూడా రెండు గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ములకలచెరుకు తెల్లవారుజామున 1.49 గంటలకు రావాల్సి ఉండగా 3.54 గంటలకు వచ్చింది. రెండు రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో లక్ష్మీపతిస్వామి భేటీ..




మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడుతున్న లక్ష్మీపతి స్వామి

బి.కొత్తకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖామాత్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో బి.కొత్తకోట మండలపరిధిలోని బీరంగి వద్ద నున్న బండెన్నస్వామి ఆలయ పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొందరు స్థానికులతో కలిసి చిన్నమండెం మండలంలోని మంత్రి నివాసంలో మంత్రిని కలిసి మాట్లాడారు. బీరంగి గ్రామంనుంచి బండెన్నస్వామి ఆలయంవద్దకు సీసీరోడ్డును మంజూరు చేయించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వచ్చే శివరాత్రిలోగా సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యేలా చూస్తానని హామీనిచ్చినట్లు పీఠాధిపతి లక్ష్మీపతిస్వామి తెలిపారు.

ప్రతి ఒక్కరూ కళలను ప్రోత్సహించాలి

మదనపల్లె టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరు కళలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుభాష్‌లో రోడ్డులోని ఎమ్మెల్యే నివాసంలో డ్యాన్స్ మాస్టర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో థిల్లానా మెగా టాలెంట్ పోటీల పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లె ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో పాల్గొనేందుకు ఎల్లపుడు ముందుంటారన్నారు. డాన్స్‌మాస్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఈ పోటీల్లో పాటలు, నృత్యం, పెయింటింగ్, మెహందీ, రంగోలి, ఫొటోగ్రఫి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు 9676499064 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తలారి రాధ, దిలీప్, దివ్యరాజు, శ్రీనాథ్, అల్తాఫ్‌ఖాన్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



సహదేవయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి అని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీ హైస్కూల్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సహదేవయ్యకు ఆదివారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సహదేవయ్య పదవీ విరమణతో ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో కొనసాగాలన్నారు. సహదేవయ్య దంపతులకు శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు రెడ్డివారి యోగేష్ రెడ్డి, ఎంఈవోలు శ్రీనివాసులు, సురేంద్రబాబు, శ్రీరాములు, హెచ్ఎంలు సంపత్‌కుమార్, జయమ్మ, శారద, జయకుమార్, ప్రకాష్, డాక్టర్ విష్ణు శివప్రసాద్, డాక్టర్ హిమబిందు తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గీతా జయంతి మహోత్సవాలు

వాల్మీకిపురం, డిసెంబరు 1: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమద్‌భగవద్గీత జయంతి మహోత్సవాలను సోమవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు బ్రహ్మశ్రీ సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. భగవద్గీత 18 అధ్యయనాలను రోజుకు ఒక అధ్యాయం చొప్పున ప్రతిరోజు సాయంత్రం 6.30గంటల నుంచి 8గంటల వరకు పారాయణం, ప్రవచన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. భక్తులందరూ కార్యక్రమానికి హాజరై భగవద్గీత గురించి సంపూర్ణంగా తెలుసుకోవచ్చన్నారు.